సాక్షి తిరుపతి
గురువారం । 13 । జూన్ । 2024



అరచేతిలో 'వాతావరణం'!

ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకునేందుకు వివిధ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. - 8లో



అందరి సహకారంతో అభివృద్ధి

ముక్కంటి ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చైర్మన్ తెలిపారు. - 8లో



నిండుకుండలా పులికాట్

సముద్రంలో ఆటుపోట్ల కారణంగా పులికాట్ సరస్సు నిండుకుండలా మారిందని నిపుణులు తెలియజేస్తున్నారు. - 8లో

బాబు కేబినెట్‌లో జిల్లాకు నో చాన్స్

- మంత్రి పదవి దక్కకపోవడంతో సీనియర్ల నిరాశ
- నీరుగారిన ఎమ్మెల్యేల ఉత్సాహం
- డీలా పడిన కూటమి శ్రేణులు



సాక్షి, తిరుపతి/చిత్తూరు: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రెండు, మూడు మంత్రి పదవులు వస్తాయని ఆశించిన ఎమ్మెల్యేల ఆశలు నీరుగారిపోయాయి. 13 మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరికి కూడా మంత్రి పదవి దక్కలేదు. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ప్రాతినిధ్యం వహించిన చంద్రబాబు నాయుడు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో జిల్లా నుంచి ఇద్దరో ముగ్గురో ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో చోటు దక్కుతుందని కూటమి నేతలు ధీమాగా ఉన్నారు. చంద్రబాబు సొంత జిల్లా కావడంతో పదవుకు ఢోకా లేదని భావించారు. ఈ క్రమంలోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఏకంగా ముగ్గురికి మంత్రి పదవులు దక్కాయి. ఈ మేరకు కూటమి ప్రభుత్వంలో కూడా ఆ స్థాయిలో మంత్రి పదవులు ఉంటాయనుకున్నారు. అయితే చంద్రబాబు తప్ప మరొకరికి మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవటంతో కూటమి శ్రేణులు డీలా పడ్డారు.

మిగిలింది నామినేటెడ్ పదవులే..

మంత్రి వర్గంలో చోటు దక్కని వారికి మిగిలిన ప్రభుత్వ పదవులైనా దక్కుతాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇస్తే గిస్తే.. చీఫ్ విప్, విప్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇవి కాకుండా.. నామినేటెడ్ పదవులు ఉన్నాయి. అయితే నామినేటెడ్ పోస్టులపై అనేక మంది నాయకులు ఆశలు పెట్టుకున్నారు. వాటిని ఎమ్మెల్యేలకు ఇస్తే.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమకేం ఇస్తారని కూటమి నేతలు దిగాలు పడుతున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్న సీఎం చంద్రబాబును స్వయంగా కలసి విన్నవించి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ప్రయత్నాలు చేయనున్నట్లు సమాచారం.

అమర్‌కి ఖాయం అనుకుంటే..

ఉమ్మడి జిల్లాలోని టీడీపీ నేతల్లో సీనియర్ అయిన పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డికి ఈ పర్యాయం మంత్రి పదవి ఖాయమని అనుకున్నారు. ఊహించని విధంగా అమర్‌నాథ్‌రెడ్డికి కేబినెట్‌లో చోటు దక్కలేదు. అలాగే తిరుపతి జిల్లాలోని సీనియర్ అయిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు సైతం మొండిచేయే మిగిలడం గమనార్హం. ఇక సామాజిక వర్గాల వారీగా చూస్తే గూడూరు, సత్యవేడు, తిరుపతి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు ముగ్గురిలో ఒక్కరికైనా మంత్రి పదవి వరిస్తుందని కూటమి నేతలు భావించారు. జనసేన కోటాలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఖాయమని అనుకున్నారు. ఆయనకు సైతం అమాత్య పదవి దక్కలేదు.

ముఖ్యమంత్రికి

సాదర స్వాగతం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాలవలవన్

రేణిగుంట : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మొట్టమొదటిగా జిల్లా పర్యటనకు విచ్చేశారు. రాత్రి 7.35గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి నారా లోకేష్ ఉన్నారు. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్, డీఐజీ షిముషి బాజ్‌పాయ్, తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు ప్రవీణ్‌కుమార్, షణ్మోహన్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు, కూటమి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రవేశ ద్వారం నుంచి విమానాశ్రయం వెలుపలకు వచ్చిన చంద్రబాబు వీఐపీ గ్యాలరీలో కొద్ది సేపు టీడీపీ శ్రేణులతో మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

పటిష్ట ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రకృతిలో తరించి.. ఆరోగ్యం వరించి!

పాతకాలం పెద్దలు చాలా బలంగా.. దృఢంగా ఉండడం నేటికీ చూస్తుంటాం. వారి ఆరోగ్య రహస్యాన్ని ఓ సారి పరిశీలిస్తే.. నాడు ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలు, ధాన్యం తినడం వల్లే ఇప్పటికీ ఇలా ఉన్నామని వారు చెబుతుంటారు. కానీ కాలానుగుణంగా రసాయనాలు విపరీతంగా వాడడంతో పంట ఉత్పత్తులు విషతుల్యమైపోయాయి. అలాంటి ఆహార పదార్థాలనే ఇప్పుడు తినడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. దీన్ని పసిగట్టిన ఓ యువకుడు ప్రకృతి సిద్ధంగా వ్యవసాయం చేయాలని భావించాడు. ఉద్యోగం వదిలి తన ఏడు ఎకరాల భూమిలో నాలుగు రకాల దేశవాళీ వరి వంగడాలు పండిస్తూ.. పదుగురికీ ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.




ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేస్తున్న వరి

నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం



చిన్నప్పటి నుంచి వ్యవసాయం అంటే ఇష్టం. ఎంసీఏ చదివి బెంగళూరులో ఉద్యోగం చేసినా.. వ్యవసాయం చేయాలనుకున్నా. ఈలోగా కోవిడ్ రావడంతో ఉద్యోగం వదిలి ప్రకృతి వ్యవసాయం ప్రారంభించా. నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా. నాలుగు రకాల దేశవాళీ వంగడాలను ఎంచుకుని పండిస్తున్నా. మొదట్లో అందరూ ఈ వ్యవసాయం ఎందుకు దండగ అన్నారు. ఇప్పుడు లాభాలు, ఆరోగ్యపరంగా మెరుగుపడుతున్న విధానాన్ని చూసి అందరూ ముందుకొస్తున్నారు. ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.50 వేలు గిట్టుబాటవుతోంది. రూ.7 లక్షలతో మిషనరీని తెచ్చుని స్వయంగా ధాన్యం మర ఆడించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నా. నలుగురికీ ఉపాధి కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది. నా పొలం పక్క రైతులు కూడా ఈ వ్యవసాయం చేపట్టేలా అవగాహన కల్పిస్తున్నాను.
- ఉయ్యాల సురేష్, యువరైతు, మానమాల, చిట్టమూరు మండలం



- ఉద్యోగం వదిలి ప్రకృతి వ్యవసాయంలో రాణింపు
- ఆదర్శంగా నిలుస్తున్న మన్నెమాల యువ రైతు
- నాలుగు రకాల దేశవాళీ వంగడాల ఎంపిక
- తానే బియ్యం ఆడించి విక్రయిస్తున్న వైనం
- పోషకాలు మెండుగా ఉంటాయంటున్న శాస్త్రవేత్తలు

చిల్లకూరు : చిట్టమూరు మండలానికి చెందిన యువ రైతు ఆలోచన పదుగురికి ఆదర్శంగా నిలుస్తోంది. తనకున్న ఏడు ఎకరాల భూమిలో పాత పద్ధతులతో సేద్యం చేపట్టి సత్ఫలితాలు సాధిస్తున్నాడు. ఎలాంటి రసాయన పురుగు మందులు వాడకుండా పండించిన పంట ద్వారా వచ్చిన బియ్యాన్ని మార్కెట్‌కు తరలిస్తున్నాడు. ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు తీసుకుని పల్లె నుంచి పట్టణానికి బియ్యం సరఫరా చేస్తూ.. ఆశించిన ఆదాయం గడిస్తుండడంతో అందరి చూపు అతనిపైనే పడింది.

ఉద్యోగం వదిలి.. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు

చిట్టమూరు మండలం, మన్నెమాలకు చెందిన ఉయ్యాల సురేష్ ఎంసీఏ వరకు చదువుకున్నాడు. తన చదువుకు తగ్గట్టు బెంగళూరులో ఉద్యోగంలో చేరాడు. నెలకు రూ.50వేల పైనే జీతం వచ్చేది. కానీ కోవిడ్ సమయంలో గ్రామానికి వచ్చి ప్రకృతి వ్యవసాయం ద్వారా కల్తీలేని ఆహారం అందించాలని నిశ్చయించుకున్నాడు. ప్రకృతి వ్యవసాయ శాస్త్ర వేత్త విజయరామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తనకున్న ఏడు ఎకరాల్లో దేశవాళి వరి వంగడాలైన బహురూపి, నవారా, మైసూర్ మల్లిక, చింతలూరు సన్నాలు సాగుచేయడం మొదలు పెట్టాడు. పంటకు పురుగు మందులు, ఇతర రసాయనాలు వాడకుండా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడడంతోపాటు.. తాను పండించిన దేశవాళి పంటను తనే స్వయంగా ఏర్పాటు చేసుకున్న మిల్లు ద్వారా ధ్యాన్యాన్ని దంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై నగరాలకు ఎగుమతి చేయడం ప్రారంభించాడు. కిలో బియ్యం రూ.60కి విక్రయిస్తున్నట్టు పేర్కొంటున్నాడు. ఆర్డర్లను బట్టి ట్రాన్స్‌పోర్టు ద్వారా బియ్యం డెలివరీ చేస్తామని యువ రైతు చెబుతున్నాడు. ఈ బియ్యం అందరికీ అందించలేక తోటి రైతులు కూడా ఇలాంటి వ్యవసాయం చేసేందుకు ప్రోత్సహిస్తున్నానని పేర్కొంటున్నాడు. ఎకరా భూమిలో పండిచిన పంట ద్వారా వచ్చిన బియ్యం ఎగుమతి చేస్తే అన్నీ ఖర్చులు పోను రూ.50 వేల వరకు ఆదాయం వస్తున్నట్టు వెల్లడించాడు.

పలు వ్యాధులకు ఉపశమనం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యం తింటే పలు రోగాల నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేద, నేచిరోపతి వైద్యులు చెబుతున్నారు. ఇలా ప్రకృతి వ్యవసాయం ద్వారా దిగుబడి అయిన బియ్యం ఆహారంగా తీసుకుంటే బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, మలబద్ధకం లాంటి వ్యాధులు తక్కువ రోజుల్లోనే తగ్గుతాయని అంటున్నారు.

జీవామృతం తయారీ ఇలా..

పంటకు ముందు దుక్కుల్లో ఆవుపేట, జిల్లేడు ఆకు వేసి కలియదున్నుతారు. తర్వాత పంట వేశాక ఆవు పేడ, పుట్టమన్ను, బెల్లం తదితర వాటిని సమపాళ్లలో కలిపి ఘన జీవామృతాన్ని తయారు చేస్తారు. వాటిని కలిపి, ఎండబెట్టి ముద్దలుగా చేసుకుని.. తర్వాత నీళ్లలో కలిపి పంటపై పిచికారీ చేస్తారు. ఇక తెగుళ్ల నివారణకు వేపాకు, జిల్లేడాకు, కానుగ ఆకు కలిపి కషాయం లాగా తయారు చేసి పంటపై పిచికారీ చేస్తారు. ఇలా చేయడం వల్ల పంట ఏపుగా పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తోందని యువ రైతు చెబుతున్నాడు.

నేల కూడా సారవంతం

ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా భావితరాల వారికి విషతుల్యం కాని భూమిని అప్పగించడంతో పాటుగా నేల కూడా సారవంతమవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆవు పేడతో తయారు చేసిన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడడంతో నేల సారవంతమవుతుందని అంటున్నారు.

పాలిష్ లేని బియ్యం శ్రేష్ఠం



మార్కెట్లో నేడు బియ్యం పలు రకాలుగా దొరుకుతోంది. వీటిలో ఎక్కువ శాతం మిషన్‌లో రెండు మూడు పర్యాయాలు వేసి పాలిష్‌పెట్టి శిల్కలా ఉండేలా చూస్తున్నారు. ఆ బియ్యం వాడకం వల్ల అన్నం చూసేందుకు పొడిపొడిగా ఉండొచ్చుగానీ వీటి వల్ల చక్కెర వ్యాధి ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. తాతల కాలంలో రసాయన ఎరువులు లేకుండా పండించిన బియ్యం తిన్న వారికి ఎలాంటి జబ్బులు లేకుండా ఆరోగ్యంగా ఉండే వారు. జబ్బులు కూడా పెద్దగా ఉండేవి కావు.
– డాక్టర్ కలపాటి చంద్రశేఖర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, మోమిడి

రసాయన ఎరువులు తగ్గించాలి



రైతులు నేడు పంట దిగుబడి పెంచేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకోకుండానే దుకాణాల నుంచి రకరకాల రసాయన ఎరువులను తీసుకొచ్చి వాడుతున్నారు. దీనివల్ల పంట దిగబడి పెరిగినా అందులో నుంచి వచ్చిన బియ్యం వాడకం వల్ల ఆరోగ్యం కొంత వరకు దెబ్బతింటోంది. అలాగే రసాయనాలు ఎక్కువ వాడడం వల్ల భూమి సత్తువ కూడా దెబ్బతింటోంది. దీనిని అధిగమించేందుకే ప్రభుత్వం ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యం వాడితే సగం జబ్బులు తగ్గిపోతాయి. **– గోపీనాయక్, వ్యవసాయశాఖ, ఏడీఏ, గూడూరు**

ఆగని దాడులు



గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీనారాయణ

- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు
- గ్రామీణ ప్రాంతాల్లో భయానక వాతావరణం
- కఠిన చర్యలు తీసుకోవాలంటున్న బాధితులు

మంగళం : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అల్లర్లకు పాల్పడుతున్నారు. కౌంటింగ్ తర్వాత మరింతగా పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై వరుస దాడులకు దిగుతున్నారు. టీడీపీ శ్రేణుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఒంటరిగా బయటకు రావడానికి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి కర్రలు, ఇనుప చువ్వలతో దాడి చేస్తుండడంపై ప్రజల్లో సైతం ఆందోళన వ్యక్తమవుతోంది. దాడి చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయకుండా వదిలేస్తుండడం వల్లే గొడవలను కొనసాగుతున్నట్లు స్థానికులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. బుధవారం తాజాగా తిరుపతి రూరల్ మండలం రణధీరపురం పంచాయతీ సర్పంచ్ లీలావతి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పట్టపగలు అందరూ చూస్తుండగానే కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రజలు భయంలో పరుగులు తీశారు.

కారును ధ్వంసం చేసినవారే..

రెండు రోజుల క్రితం సప్తగిరి కాలనీ పంచాయతీ ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలే తనపై దాడి చేసినట్లుగా బాధితుడు వివరించారు. అసలు ఎందుకు కొడుతున్నారో కూడా తెలియకుండా కరలతో చచ్చేలా కొట్టారని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెవిరెడ్డి పరామర్శ



లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీనారాయణపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెంటనే స్పందించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం చేర్పిన రుయా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మీనారాయణకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. దాడికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విన్నవించారు. బాధితుడికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మంగళం ఔట్‌పోస్టులో ఫిర్యాదు

టీడీపీ నేతల అరాచకాలను అడ్డుకోవాలని, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులను అరికట్టాలని బాధితుడు లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మంగళం పోలీస్ ఔట్‌పోస్టులో ఎస్‌ఐ జగన్నాథానికి ఫిర్యాదు చేశారు. తిరుపతి నుంచి ఇంటికి వెళుతుంటే మంగళం సర్కిల్ వద్ద టీడీపీ నాయకులు తనను అడ్డగించి అమానుషంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ప్రళయకావేరి నారాయణరెడ్డి, తిరుమలనగర్, సప్తగిరినగర్ పంచాయతీల ఇన్‌చార్జిలు గుండ్రాజు శివశంకర్‌రాజు, అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్‌లు మల్లెమొగ్గల ఉమాపతి, బైరెడ్డి రమేష్, పంచాయతీ అధ్యక్షుడు రజాక్, వార్డు సభ్యుడు దయాకర్ ఉన్నారు.

బడికి వేళాయె!



- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- స్కూలు బాట పట్టనున్న విద్యార్థులు
- తొలిరోజే విద్యాసామగ్రి పంపిణీకి అధికారుల కసరత్తు

తిరుపతి ఎడ్యుకేషన్ : విజ్ఞానం విద్యతోనే సాధ్యం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యారంగానికి ఉన్న ప్రాధాన్యత మరోదానికి లేదు. కుటుంబపరంగా, సమాజపరంగా ఎన్నిరకాల ఇబ్బందులు ఎదురైనా తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను ఇవ్వాలనే తాపత్రయపడతారు. పేదరికాన్ని సైతం ఎదురొడ్డి చదివించేందుకు ఆరుగాలం కష్టపడతారు. అయితే వేసవి సెలవులు ముగియడంతో పిల్లలను స్కూల్‌కు పంపేందుకు తల్లిదండ్రులు ఇప్పటికే సిద్ధమయ్యారు. విద్యార్థులను బడికి పంపడంలో తల్లిదండ్రులపై ఉన్న గురుతర బాధ్యతను తెలియజేస్తోంది.

ఒకప్పుడు యూనిఫామ్ అంటే..

గతంలో యూనిఫామ్ అంటే ప్రైవేట్ స్కూళ్లకే అన్న భావన ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా సర్కారు బడుల్లోని విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేసింది. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చించింది. పైగా తొలిరోజే విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేసింది. ఇప్పుడు కొత్తప్రభుత్వం ఏర్పాటైంది. అదే ఒరవడిని కొనసాగిస్తారని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

నాణ్యమైన విద్య



తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి. సర్కారు బడుల్లో అత్యాధునిక మౌలిక వసతులు ఉన్నాయి. నాణ్యమైన విద్య అందిస్తున్నాం. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యాసామాగ్రి అందిస్తాం. అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. **– శేఖర్, డీఈఓ, తిరుపతి**

న్యూస్‌రీల్

రేపు ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ కంపెనీ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాలో ఫార్మసీ ఎయిడ్, రీటైల్ ట్రైనీ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీతో పాటు డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ చేసిన యువతీయువకులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి సేవలో సోధే వాదిరాజా మఠం పీఠాధిపతి



శ్రీవారి ఆలయం వద్ద పీఠాధిపతి విశ్వ వల్లభ తీర్థ స్వామి, కన్నడ నటులు రక్షిత్ శెట్టి, రాజ్ బి శెట్టి

తిరుమల : తిరుమల శ్రీవారిని బుధవారం ఉడిపిలోని సోధే వాదిరాజా మఠం పీఠాధిపతి విశ్వ వల్లభ తీర్థ స్వామి సేవించుకున్నారు. బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆయనకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. పీఠాధిపతితో పాటు కన్నడ సినీ నటులు రక్షిత్ శెట్టి, రాజ్ బి శెట్టి శ్రీవారి దర్శించుకున్నారు.

16న జాతీయ శతాధిక కవి సమ్మేళనం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పద్మనాభం తదితరులు

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూలో ఈ నెల 16వ తేదీన జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ జి.పద్మనాభం తెలిపారు. బుధవారం ఈ మేరకు ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్‌తో కలిసి సమ్మేళనం బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీకళా వేదిక రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధనాసి ఉషారాణి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. ధనాసి ఉషారాణి మాట్లాడుతూ ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీకళావేదిక అని తెలిపారు. తిరుపతిలో కవితోత్సవం పేరుతో సమ్మేళనం చేపడుతున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి బంద ప్రతాప్, కన్వీనర్ కొల్లా రమావతి, ఈశ్వరీ భూషణం, హరి సర్వోత్తమ నాయుడు, చిట్టి లలిత, పార్థసారథి, సంపత్‌కుమార్, గుండాల రాకేష్, కవులు సుధాకర్, నిర్మల, అవధాని మేడసాని మోహన్, సమాజ సేవకురాలు స్పెషల్ బ్రాంచ్ సుమతి, వీసీ కుసుమకుమారి, భూమన హాజరవుతారని తెలిపారు.

రుయా సీఎస్ఆర్ఎంఓ సరెండర్



డాక్టర్ లక్ష్మానాయక్

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రి సీఎస్ఆర్ ఎంఓ డాక్టర్ లక్ష్మానాయక్‌ను సరెండర్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఉత్తర్వులు జారీచేసింది. బుధవారం ఈ మేరకు ఉత్తర్వులను రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి అందజేశారు. విధి నిర్వహణలోని డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, తోటి అధికారులను సైతం లక్ష్మానాయక్ ఇబ్బంది పెట్టేవారని, ఎవరినీ లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 21 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,665 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,377 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.58 కోట్లు ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

క్లుప్తంగా

డీఎస్పీ డ్రైవర్‌పై టీడీపీ కార్యకర్త దాడి

శ్రీకాళహస్తి: డీఎస్పీ డ్రైవర్‌పై ఓ టీడీపీ కార్యకర్త దాడి చేసిన ఘటన శ్రీకాళహస్తిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ముత్తరాశిపాళెంలో స్క్రాప్ దుకాణం నిర్వహించుకుంటూ సంపత్‌కుమార్, సుగుణ దంపతులు జీవిస్తున్నారు. వేకువజామున 3 గంటలకు మెగా కంపెనీలో పనిచేసే రాధాకృష్ణ ఫోన్ చేసి స్క్రాప్ తీసుకువచ్చామని తెలిపాడు. భార్యాభర్తలు కలిసి వెళ్లగా ముత్తరాశిపాళానికి చెందిన టీడీపీ కార్యకర్త శివారెడ్డి, అనుచరుడు హరీష్, మరో యువకుడు కలిసి రాధాకృష్ణతో గొడవపడుతూ కనిపించారు. మెగా కంపెనీలో అపహరించిన వస్తువులను ఇక్కడ అమ్ముతున్నావా అంటూ శివారెడ్డి ఆరోపిస్తూ తనకు డబ్బు ఇవ్వకుంటే మీ అంతు చూస్తానంటూ బెదిరించాడు. దొంగ వస్తువులను కొంటారా అంటూ సంపత్‌పై సైతం దాడి చేసి సుగుణ మంగళసూత్రం లాగేసుకున్నాడు. ఇంతో కారు పార్కింగ్ చేసేందుకు అక్కడకు వచ్చిన డీఎస్పీ డ్రైవర్ ఈ విషయం గమనించి అడ్డుకోబోయాడు. దీంతో ఆగ్రహించిన శివారెడ్డి తన అనుచరులతో కలిసి డీఎస్పీ డ్రైవర్‌పై సైతం దాడి చేశాడు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని శివారెడ్డి, అతడి అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


గుర్తుతెలియని యువకుడి హత్య



పాకాల : బండ రాళ్లతో కొట్టి గుర్తుతెలియని యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన బుధవారం వెలుగుచూసింది. ఎస్ఐ మహేష్‌బాబు కథనం మేరకు .. దామలచెరువు- బందార్లపల్లె మధ్యలో వెంకట్రాయని చెరువు వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన వెళ్లారు. ఘటనాస్థలంలో సుమారు 25 ఏళ్ల యువకుడు హత్యకు గురైనట్లు గుర్తించారు. మృతుడి ఒంటిపై నల్లటి ప్యాంటు ఉంది. క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

అరచేతిలో వాతావరణం!

వాన రాకడ.. ప్రాణం పోకడ కనిపెట్టలేమని గతంలో పెద్దలు చెప్పేవారు. అయితే ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో వర్షం ఎప్పుడు వస్తుందో సులువగా కనిపెట్టేస్తున్నారు. కొన్ని యాప్స్‌ను ఉపయోగించి వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మెసేజ్‌ల రూపంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అరచేతిలో సెల్ ఫోన్ ఉంటే చాలు.. ప్రకృతి విపత్తుల గురించి ముందస్తుగానే హెచ్చరికలు అందుకుని జాగ్రత్త పడుతున్నారు.





- వాన రాకడ కనిపెట్టేందుకు ప్రత్యేకంగా యాప్స్
- పంచాయతీ స్థాయిలో అంచనాకు అవకాశం
- వ్యవసాయ రంగానికి ప్రయోజనం
- విపత్తు సమయంలో మరింత ఉపయోగకరం

తిరుపతి అర్బన్ : వర్షం రాకను టెక్నాలజీ సాయంతో అంచనా వేయవచ్చు. యాప్స్ ద్వారా తెలుసుకున్న సమాచారాన్ని మెసేజ్‌ల రూపంలో సెల్ ఫోన్లకు పంపి ప్రజలను అప్రమత్తం చేయవచ్చు. ఫలితంగా భారీ వర్షాలు, ఈదురుగాలులు, పిడుగుపాటు తదితర విపత్తుల నుంచి పూర్తిగా బయటపడలేకపోయినా నష్టం శాతాన్ని తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా వ్యవసాయ, అనుబంధరంగాల వారికి వాతావరణ పరిస్థితులను కనిపెట్టే యాప్స్ ఎంతో ఉపయోగకరమని నిపుణులు సూచిస్తున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో పంట నష్టం వాటిల్లుతుంది. ఈ యాప్‌ల ద్వారా రాబోయే ప్రమాదాన్ని ముందుగానే తెలుసుకుంటే కొంతో కొంత జాగ్రత్త పడే అవకాశముంటుంది. ఈ క్రమంలోనే పిడుగుపాటు కారణంగా రైతులు, పశువులు, గొర్రెలు ఇతర జంతువుల ప్రాణాలు పోతుంటాయి. పిడుగు పడే విషయాన్ని ముందుస్తుగా తెలుసుకునే వీలు లేక ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తున్నాయి. ఈ కష్టాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెరదించింది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావారణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే వాతావారణం వివరాలు తెలుసుకుని అప్రమత్తమయ్యే వెసులుబాటు కల్పిస్తోంది.

'మేఘదూత్'తో ముందస్తుగా..

పంట సాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయంలో రైతులను నష్టపరిచేది వర్షమే. ఇలాంటి కష్టాల నుంచి బయపడేందుకు మేఘదూత్ యాప్‌ను రూపొందించారు. దీని సాయంతో వారం ముందుగానే వాతావారణ మార్పులు, వర్షసూచన సహా ఆకాశం మేఘావృతం అవుతుందా?..లేదా?.. గాలులు ఏదిశ నుంచి ఏదిశకు వీస్తాయి?తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా మంగళ, శుక్రవారాల్లో వాతావరణ సమాచారంతో రైతులకు మేసేజ్‌లు పంపుతున్నారు.


రెయిన్ అలారమ్ : గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతడికి సమీపంలోని 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ వర్ష సూచనలున్నాయో క్షణాల్లో ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉందటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.



ఆన్‌లైన్‌లో అందుబాటు

"ఎప్పటికప్పుడు వాతావారణ పరిస్థితులను తెలుసుకునేందుకు కొన్ని యాప్‌లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. వర్ష సూచన తెలియక విత్తనాలు వేసుకోవడం, పురుగు ముందులు పిచికారీ, ఎరువులు వేసుకోవడం చేస్తుంటారు. అప్పుడు వర్షం వస్తే నష్టాలు తప్పవు. వాతావరణ యాప్‌ల ద్వారా ముందస్తుగా అప్రమత్తం కావచ్చు. నష్ట నివారణ చేసుకోవచ్చు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి.

– ధనుంజయరెడ్డి, ఏడీఏ, తిరుపతి



వజ్రపాత్ యాప్ : గూగుల్ ప్లేస్టోర్ నుంచి వజ్రపాత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమవైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. అక్కడ నొక్కితే మనం ఉన్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్ వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8,15,30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్ది సేపట్లో ఎంత దూరంలో పిడుగు పడే అవకాశం ఉందని చూపిస్తుంది. అలాంటిదేమీ లేకపోతే మీ సమీపంలో పిడుగుపడే అవకాశం లేదని చూపిస్తుంది. యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది. యాప్ ఆన్ చేసి ఎప్పటికప్పుడు అప్రమత్తం కావొచ్చు.

దామిని యాప్

ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియజేసేందుకు దామిని యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో సమీపంలోని 20 కిలోమీటర్ల పరిధిలో 5 నుంచి 20 నిమిషాల వ్యవధిలో పిడుగు ఎక్కడ పడే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. లోకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశముందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటివారికి అందించాల్సిన వైద్యసాయం, శ్వాస ఆగిపోతే తీసుకోవాల్సిన చర్యలు, గుండె చప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలను తెలియజేస్తుంది.



కార్యకర్తలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వెంకటగిరిలోని ఎస్‌జేఆర్ భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90శాతం నెరవేర్చామన్నారు. అయినప్పటికీ 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే టీడీపీ ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో నెరవేర్చాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం, కక్షపూరిత చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు శుభాకాంక్షలని, నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఎంపీ గురుమూర్తి గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. తిరుపతి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఓటమిపాలైనా.. గురుమూర్తి విజయం సాధించారని వివరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు చెలికం శంకర్‌రెడ్డి, నక్కా వెంకటేశ్వరరావు, ఎల్.కోటేశ్వరరావు, సేతరాసి బాలయ్య, కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ నాయకులు పులి ప్రసాద్‌రెడ్డి, ఎం.వెంటేశ్వర్లు, చింతల శ్రీనివాసులరెడ్డి, కౌన్సిలర్లు కందాటి కల్యాణి, వహిదా, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి కె.రామతులసి , నాయకులు వలికల కృష్ణయ్య, యస్దానీబాషా, సతీష్ పాల్గొన్నారు.


అందరి సహకారంతో అభివృద్ధి



రాజీనామా పత్రాలతో శ్రీకాళహస్తి పాలకమండలి సభ్యులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి ఆధ్వర్యంలో భక్తులు, అధికారుల సహకారంతో ఎన్నో అభివృద్ధి పూర్తి చేసినట్లు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న 16 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించామన్నారు. ఈ క్రమలోనే ఉప ఆలయాల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం చేశామని చెప్పారు. పట్టణానికే శోభ తెచ్చేలా భక్తకన్నప్ప సర్కిల్, నంది సర్కిల్, శివ సర్కిల్‌తోపాటు నాలుగు మాడ వీధులను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా విద్యుద్దీపాలతో తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. గిరి ప్రదక్షణ మార్గంలో 9 విడిది మండపాలు, వెయ్యి మొక్కలతో బిల్వ వనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ పాలకమండలి ఆధ్వర్యంలో ఎన్నడూ లేని విధంగా ఏడు గంగమ్మల జాతరకే కాకుండా పట్టణంలోని పలు గంగమ్మ ఆలయాలు, పరిసర ప్రాంతాల గంగ జాతర సందర్భంగా అమ్మవారికి సారెను అందజేసినట్లు తెలిపారు. 120 గదుల కైలాస్ సదన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దాతల సాయంతో వెండి అంబారీలు, పెద్ద నందీశ్వరునికి వెండి కవచం, అంజి అంజి వినాయకునికి వెండి కవచం అలంకరించామని వివరించారు. ఊరందూరులోని నీలకంఠేశ్వరాలయంలో నూతన ధ్వజ స్తంభం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నూతన అతిథిగృహాల నిర్మాణానికి దాతల నుంచి రూ.1.5కోట్లు సేకరించినట్లు వెల్లడించారు. సుమారు వెయ్యేళ్ల క్రితం ఆలయం ఎదుట గీసిన రాశి చక్రాలను ఆర్గానిక్ రంగులతో పునరుద్ధరించినట్లు తెలిపారు. గిరి ప్రదక్షిణ మార్గంలో సిమెంటు రోడ్డు నిర్మించామన్నారు. తమ పదవీకాలంలో ఇన్ని పనులు పూర్తి చేసేందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమలో పాలకమండలి సభ్యులు బుల్లెట్ జయశ్యామ్, ప్రకాశం పంతులు, పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఆవులపాటి శ్రీనివాసులు, కొండూరు సునీత, రమాప్రభ, పసల సుమతి, లక్ష్మి, జయమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు కంతా ఉదయ్, పాండు, జూలుగంటి సుబ్బారావు, శోభ గౌడ్, సుశీల, స్థానిక నేతలు నరసింహులు, భాస్కర్ ముదిరాజ్, గణేష్, లక్ష్మీపతి, మణి, యానాది, కుమారస్వామి, గిరిప్రసాద్ గౌడ్, పుట్టం రాజా ముదిరాజ్ పాల్గొన్నారు.

నిండు కుండలా పులికాట్



పులికాట్‌లో పక్షుల సందడి

సూళ్లూరుపేట : పులికాట్ సరస్సు నిండు కుండను తలపిస్తోంది. నిన్న మొన్నటి వరకు సరస్సు ఎండిపోయి ఉప్పుతో కప్పబడి శ్వేత వర్ణపు ఎడారిలా మారిపోయింది. దీంతో పులికాట్ సమీప గ్రామాల ప్రజలు ఉప్పు సేకరించుకుని విక్రయాలు సాగించారు. నిన్న మొన్నటి వరకు ఇదే పరిస్థితి ఉంది. అయితే ఇప్పుడు ఒక్కసారిగా సరస్సులోకి భారీగా నీరు చేరింది. చెదురు మదురుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ అవి పులికాట్ సరస్సు దాకా చేరే అవకాశం లేదు. అయితే హఠాత్తుగా నీరు ఎందుకు చేరిందని పలువరి మదిలో ప్రశలు తలెత్తాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల ఆటుపోట్లు ఏర్పడి సముద్రం నుంచి సరస్సులోకి ఉప్పునీరు విపరీతంగా చేరిందని నిపుణులు వెల్లడిస్తున్నారు. పులికాట్ సరస్సుకు, బంగాళాఖాతానికి వున్న అవినావ సంబంధం వల్ల తరుచుగా ఇలా జరుగుతూవుండడం కూడా సహజమేనని తెలియజేస్తున్నారు. సుముద్రం నుంచి ఉప్పునీటితో పాటు మత్స్య సంపద కూడా తరలిరావడంతో సంప్రదాయ మత్స్యకారులు, విసురుడు వలలతో చేపలు పట్టుకునే తీరప్రాంత గిరిజన జాలర్లుకు చేతినిండా పని దొరికింది. పులికాట్‌లో నీరు చేరడమే తరువాయి ఎవరో పిలిచినట్టగా అప్పుడే కొన్ని రకాల విదేశీ, స్వదేశీ విహంగాలు ఆహారవేటలో పడ్డాయి. ఫ్లెమింగోలు కూడా అక్కడక్కడా గుంపులు గుంపులుగా చేరి దర్శనమిస్తున్నాయి.

వ్యక్తి ఆత్మహత్య



అమీర్‌బాషా మృతదేహం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని అగ్రహారంపేటలో అమీర్‌బాషా(35) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. డ్రైవర్‌గా పనిచేసే అమీర్‌బాషా డక్కిలి మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన సెల్విని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. మద్యానికి బానిసైన అమీర్‌తో వేగలేక సెల్వి మూడేళ్ల నుంచి విడిగా ఉంటోంది. ఈ క్రమంలో అమీర్ బాషా ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు : దంపతుల మృతి



మృత దేహాలను తరలిస్తున్న పోలీసులు

పాకాల : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై గాదంకి (నేంద్రగుంట) రాడార్ కేంద్రం సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జ్యోతిగోయల్ (34), ఆశిష్‌గోయల్(30), వారి కుమారుడు సుశాల్‌గోయల్ (7) బెంగుళూరు నుంచి తిరుమలకు కారులో బయలుదేరారు. మార్గం మధ్యలో ముందు వెళుతున్న కంటైనర్‌ను వెనక వైపు నుంచి కారు ఢీ కొంది. ఈ ఘటనలో జ్యోతిగోయల్, ఆశిష్‌గోయల్ అక్కడికక్కడే మృతి చెందారు. వారి కుమారుడు సుశాల్‌గోయల్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సుశాల్‌గోయాల్‌ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులు ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నట్టు గుర్తించామని వెల్లడించారు.

ఉపాధి పనుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

పిచ్చాటూరు : మండలంలోని కీళపూడి సమీపంలో అరణియార్ వద్ద సాగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ బుధవారం పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పనుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పండ్ల తోటల పెంపకానికి సంబంధించిన పనులు చేపట్టాలని సూచించారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ సరిత, సీడీసీఎల్ఆర్‌సీ చంద్రశేఖర్, ఏపీఓ నాగభూషణమ్మ, సాంకేతిక సహాయకుడు పుష్పరాజ్ పాల్గొన్నారు.